అవధి

యమ్. వి. జె. వి. సుబ్బారావుగారు

పూర్ణచంద్రుని మించినది వాసవదత్త సౌందర్యము. కమలముకంటె మృదువైన దేహము. వీణ నతిక్రమించిన వాఙ్మాధుర్యము. హరిణములను లజ్జపరచుచున్న నేత్రములు తన యభిలాషానుసారము తన కోమల కరములతో సజీవమైన సువర్ణవిగ్రహమును తయారు చేశాడు విధాత.

భువనమోహితమైనశోభ—మనోహరమైన సౌందర్యము—ఇచ్చి కూడా ఆమెను వేశ్యనుగా చేయుట ఉచితమే? పంకమందు పంకజములనూ, ముండ్లలో ఫలములను పండించు యాతనికే ఎరుక.

* * *

వసంత ప్రభాతము. కోయలల మధురగానాలాపములతో వీస్తోంది మలయమారుతము. సువిశాలమైన వాసవదత్తయొక్క ప్రాంగణద్వారమువద్ద భిక్షకై నిలచియున్నాడొక శ్రమణి. హఠాత్తుగా తన దృష్టి మరల్చినది వాసవదత్త. ఒకమారు చూచింది-రెండుమార్లు-నూరుమార్లు-చూస్తూ నిలబడిపోయిందామె.

ఉపగుప్తుడు వాని పేరు. ప్రపంచదృష్టిలో యాతడు భిక్షువే కాని స్వర్గీయదృష్టిలో రాజరాజేశ్వరుడే వాస్తవముగా—మానసమును మించి శ్రేష్ఠమైన విశాలరాజ్య మేదియు లేదుగదా!—అట్టి మానసముపై విజయముగాంచిన యోగి ఉపగుప్తుడు. రాజాధిరాజు, తాను. సమస్తేంద్రియములు అతని ప్రజ. విశ్వముయొక్క చంచలత, అశాంతి వాని వంటవు. వాని నిశ్చలనేత్రములు శాంతములు. స్వర్గీయ దివ్యకాంతులచే భాసమానమైనది యాతని ముఖమండలము. కాషాయవస్త్రములు వాని కినుమడించిన శోభనిస్తూన్నవి.

* * *

విశ్వమంతను ఓడించు సామర్థ్యముగల వాసవదత్త ఓడిపోయిందా భిక్షువు యెదుట. వాని సౌందర్యమును చూసి ముగ్ధురాలైంది. చీరచెరగు జారిపోయింది. కేశబంధము వీడి పుష్పమాల నేలపై పడిపోయింది.

ఉపగుప్తుని దగ్గరకుపోయి భిక్షాపాత్రను ముందుకు చాపమన్నదామె. భిక్షాపాత్రను చాచి సాశ్చర్యముగా "నీ హస్తద్వయము రిక్తమైయున్నది. నా కేమి ఇవ్వగలవు?" అన్నాడాతడు.

"ఈ హస్తద్వయము నీ వీ ప్రపంచములో పొందలేని వస్తువు నిచ్చును."

"అనగా?".

"ఈ హస్తములు రిక్తములు గావు."

"నేనా స్వర్ణభూషణముల నేమి చేసుకుందును?"

"స్వర్ణభూషణముల సంగతి గాదు. ఈ హస్తములు రిక్తములు గావు. ఇవి ప్రేమాలింగనముతో నిండియున్నాయి. నే నా యాలింగనము నే నీ కర్పింతును. ఏ వాసవదత్త స్పర్శమాత్రమునకు రాజాధిరాజులుకూడా వ్యాకులపడుదురో ఆ వాసవదత్త నీకు ప్రేమాలింగన మర్పించుటకు సిద్ధమైయుంది."

ఉపగుప్తుని ముఖభావములు మారలేదు. మాటలాడ కూరకున్నాడాతడు.

"భిక్షాపాత్రను చాపుము. నా హృదయ మర్పించెదను."

"దీని అర్థము?"

"అనగా నీ యీ సుకుమారశరీరము భిక్షావృత్తికి గాదు. నీ యీ అనుపమలావణ్యము విశ్వస్పర్శ నుండి దూరములోనున్న వనములలో శిథిలమగుటకు గాదు. రమ్మా నా సదనమునకు. నీ దాసి నగుదును నేను."

ఒక్క చిరునగవు నవ్వి ఊరకున్నాడుపగుప్తుడు. వికలమతియై జవాబిమ్మంది వాసవదత్త.

“అనేక కారణములవలన యిప్పుడు వీలుకాదు.”

“అయితే ఎప్పుడు.?”

“తిరిగి కొన్నిదినముల తర్వాత!” తనలో తానాలోచించింది వాసవదత్త: రమణి రూపమునకే అవమానమా? ఒక సామాన్యభిక్షువే తిరస్కరించెనా? చూచెదనుగాక, నే నా సమయము నిరీక్షింతును.

వేగముగా సంఘము వైపుకు వెళ్లిపోతా డుపగుప్తుడు. నిశ్చలదృష్టితో చూస్తూ సువర్ణమూర్తి లాగున నిలచియుంది వాసవదత్త.

* * *

తన స్వల్పజీవనముయొక్క ప్రకాశమును కనపర్చి తీవ్రగతితో పోయింది సంధ్యాకాలము. శరదాకాశమున ఉదయించే చంద్రకిరణములు రూపోజ్జ్వల కాంతులతో వెన్నెలను వెదజల్లుచున్నవి. సాంద్రారణ్యముయొక్క చరణములను కడుగుతూన్నదా యనునట్లు కలకలధ్వని చేస్తూ ప్రవహిస్తోంది గంగామతల్లి. పగలంతా భిక్షాటనచేసి యలసిన ఉపగుప్తుడు ఆ యువనిగుండా వెళుతున్నాడు తన మఠమునకు.

వెళ్తూన్న ఉపగుప్తుని చూచి హింస్రపశువగు కేసరి యొకటతనిపై దుముకుటకు సిద్ధమైంది. భిక్షువు చూశాడు. శిరము వంచాడు. ఒకవైపు ఉపగుప్తుని భక్షించుటకు సిద్ధంగా ఉంది సింహము. వేరొకవైపు సింహమున కాహారమై నిలుచున్నా డుపగుప్తుడు. దగ్గర పొదలోనున్న వేటకాడొకడా భయంకరదృశ్యము చూశాడు. భిక్షువుపై దుముకుతూంది సింహము. ఇంతలోనే వేటకాడా సింహమును భూశయనం చేశాడు—నలువైపుల చకితుడై పరికించా డుపగుప్తుడు. తన కార్యసాఫల్యమునకై చిరునగవు నవ్వుకుంటూ ధనుర్ధారియైన వేటకాడు వస్తున్నా డుపగుప్తుని వైపుకి. దుఃఖస్వరముతో “ఆహా! ఏమి చేసితివి? అకారణముగా నిరపరాధి జంతువును హత్యచేసితివి? నీకే మపకారము గావించినది?” అన్నాడు భిక్షువు.

“సింహము—నిరపరాధిత్వము!” తనలో తానాలోచించాడు వేటకాడు. తన దయాహీన కఠోర జీవనములో కరుణాదేవీదర్శనమున కిదియే మొదటి పర్యాయ మా వ్యాధునికి. చక్రాంకితమూర్తివలె స్తంభితుడైపోయాడు. ఉపగుప్తుని కరుణార్ద్రదృష్టి వ్యాధునిపై పడినది. వ్యాధునిహృదయ మాతని సందేశమును గ్రహించింది. నయనములు చూశాయి. హస్తద్వయము కదల్చేడు. భుజముపైనున్న అమ్ముల పొదితీశాడు. గంగానదీ గర్భమందు పారేశాడు. వాని నిర్దయత గంగలో మునిగిపోయింది. తన భుజబలముతో రెండు ముక్కలుగాచేసి క్రింద పారేశాడు ధనస్సును. అతని కఠోరత అంతిమశ్వాస తీసుకో నారంభించింది. ఆపై నాతడా భిక్షువుపాదములపై బడ్డాడు. “దేవా! ఇదే నా కడపటిహత్య” అన్నాడు. ప్రసన్నముఖముతో నాశీర్వదించాడా భిక్షువు. వేటకాడు తన నూతనప్రపంచములో ప్రవేశించుటకు వెళ్లిపోయాడు. కరుణ యాతని మార్గదర్శిని.

దయార్ద్రహృదయుడైన ఉపగుప్తుడు కేసరిని వీక్షించాడు. బాణము బాగుగా గుచ్చుకొనిపోయింది హృదయములోకి. బహుప్రయాసచే గంగాతటమునకు తీసుకువెళ్లాడా సింహమును. గాయమును కడుగ నారంభించాడు.

గంగామతల్లియొక్క చంచలహృదయములో గానామృతము దశదిశల వర్షిస్తోపోతోంది ఒక నావ. శరచ్చంద్రిక బాగుగా నృత్యముచేస్తో వనప్రాంతమునకు, గంగా కెరటములకు అపూర్వశోభ నిస్తోంది.

స్వకార్యతత్పరుడైయున్నా డుపగుప్తుడు. మృగరాజు జీవితాశ అయితే కొద్దికాని దత్తచిత్తుడై తన పని చేసుకుంటున్నాడా భిక్షువు. నావ ఆవైపుకే వస్తోంది. గానస్వర మిప్పుడు స్పష్టముగా వినిపిస్తోందాతనికి. దృష్టి సారించాడు. నావలో ఎవరు? ఎవరోకాదు ముక్తకుంతలారూపసియగు నా వాసవ

దత్తే శరచ్చంద్రికతో నయనయుద్ధంచేస్తో పాడుతోంది.

సింహము హృదయమునుండి బాణము లాగుటకు చేయి చాపేడు. హఠాత్తుగా గాన మాగిపోయింది. నావ భిక్షువు సమీపమునకు వస్తోంది. అకస్మాత్తుగా చకితురాలై "భిక్షు! ఏమి చేస్తున్నావు? ఈ భయంకరమైన హింస్రపశువు జీవితలాభమును పొందియు ప్రాణదాతను గుర్తెరుగజాలదన్న సంగతి తెలియదా? నీకు సర్వనాశనము కాగలదు'' అని అరచింది నావనుండి వాసవదత్త.

"రమణీ! నీవు పొరపడుతున్నావు. బాహ్యసుందరములైయున్న హింస్రపశువులకంటె క్రూరమైనది కాదీ హింస్రపశువు. మానవులలో శత్రుత్వమును పెంపొందించి హత్యలుకూడా చేయించే సుందరరూపముకంటె కఠోరతరమైనదియు గాదు. తన బంధనములో మానవుని బంధించే మనోహరమైన మోహముకంటె భయానకమైనదియుంగాదు" అన్నాడుపగుప్తుడు గంభీరస్వరంతో. వాసవదత్త ఏమియు తెలియజాలకపోయింది. ప్రేమోన్మాదినియై "భిక్షువా! నేను ప్రతీక్ష చేస్తో చేస్తో విసిగిపోయాను. నీవు రాలేదు. మరచిపోయావా?" అంది వాసవదత్త.

"లేదు, మరువలేదు. నేను వస్తాను కొన్నిదినములు పోయినతరువాత."

"నేడే రమ్ము. ఇంతకంటె మించినసమయమెప్పుడు రాగలదు? నేడు చంద్రుడు విశ్వముయొక్క అంధకారమును తొలగించుతున్నాడు. నీవు నా హృదయాంధకారమును తొలగించుము."

"ఆగు"మని సింహము హృదయమునుండి బాణము లాగుతున్నాడుపగుప్తుడు.

"నీవు సౌందర్యమనే బాణంతో నన్ను బాధిస్తున్నావు. మున్ముందు నాకు ప్రాణదానమిత్తువా?''

"ధైర్యమూనుము సుందరీ! నేను తప్పకవస్తాను."

"ఎప్పుడు? నీ నిరీక్షణచేస్తో నా నేత్రజ్యోతి చల్లారిన తర్వాతనా? దినములు లెక్కపెడుతూ కాలము నా జవ్వనమును లాగుకొని తీసుకొనిపోయిన తర్వాతనా?........ఎప్పుడు? ఎప్పుడు వచ్చెదవు?"

"ఈ జీవితములో.''

"ఈజీవితములో? దీనికి చాలాకాలము పట్టును."

"అయితే ఎప్పుడు?''

"ఈ క్షణమనుము.''

"కాదు''.

"మరెప్పుడు? యీ వారములో.''

"కొలది సంవత్సరములలో.''

"భరించలేను. ఈ మాసములోనైన...?"

"ఈ సంవత్సరములో వస్తాను. ఇది నిజమని నమ్ము."

"సరే! నేను వ్రేళ్లపైన దినములు, శ్వాసపైన క్షణములు లెక్కించుకుంటాను."

వాసవదత్త వెళ్లిపోయింది. మృతప్రాయమై పడియున్న సింహమునుండి బాణము లాగుతున్నాడుపగుప్తుడు.

*   *   *   *

శరదృతువు గడిచింది. శిశిరముపోయింది. హేమంతముపోయింది. కాని ఉపగుప్తుడు రాలేదు. అనేకసార్లు అశ్రుపూర్ణనిరీక్షణములు చేసింది వాసవదత్త. అనేకసార్లు శృంగారించుకొంది. అంతా వ్యర్థమైంది.

సుమన, సుగంధ, సంజీవనులలో వసంతము వచ్చింది. భిక్షువు రాలేదు. చూస్తూండగా అవధి గడచిపోవచ్చింది. కాని ఉపగుప్తుడు రాలేదు.

ఇంక రెండు మాసములు అవధి—ఒక మాసము. ప్రపంచములోని పాంథనివాసియైన వర్షర్తువు వెళ్లిపోవుటకు నిశ్చయించుకుంది. శిశిరకంటలిభుజముపై

ధరించింది. హేమంతపు బిఛానా బిగించింది. వసంతపు పుష్పవస్త్రమును తీసుకుంద. గ్రీష్మాతపత్రము చేతిలోనా, పాదరక్షలు పదములకు ధరించి ముందుకు సాగుతోంది. వికలచిత్తయై 'నా ప్రియతము డీ సంవత్సరము రాడా?' అనుకొంది వాసవదత్త.

రాత్రిసమయము. జగమంతయు నిబిడాంధకారములో మునిగింది. సహస్రవిద్యుత్కాంతులతో విరాజమానమై ప్రకాశిస్తోంది వాసవదత్త భవనము. తేజఃకిరణము లామె స్వర్ణభూషణములలో ప్రతిఫలిస్తూ విలాసతరగతి కపూర్వశోభ నిస్తున్నాయి. అసంఖ్యాకములైన విద్యుద్దీపముల మధ్య నక్షత్రమధ్యమందున్న చంద్రునివలె ప్రకాశిస్తోంది వాసవదత్త ముఖమండలము.

ఆరోజున వాసవదత్త భవనమందు ఆమె ప్రేమికయగు నొక లక్షాధికారికి స్వాగతార్థమై ఉత్సవము జరుగుతోంది. ఒకవైపు నృత్తవాద్యగీతములు, మరియొకవైపు సురాపానములు. మధ్య అభాగుడైన లక్షపతి మునిగిపోయాడు.

అర్ధరాత్రి సమయము. లక్షపతి సురాపానమత్తతచే అచేతనుడైయున్నాడు. సంగీత మాగిపోయింది. దాసదాసీజనంబు లెవరి గృహములకు వా రేగిరి. వాసవదత్తా లక్షపతులుమాత్ర మచ్చటనుండిరి. కాదు కాదు. వారికి తెలియకుండా నచ్చట కూర్చునియున్న దొక పిశాచిని. ఎవరామె? వాసవదత్త పరిచారికయే. నలువైపుల పరికించి పరనుండి కత్తిని తీసింది వాసవదత్త. అర్ధరాత్రి సమయమున నొక వేశ్యా హస్తమున కటారి! ఏమిచేయగోరుతున్నదామె. సంగీతామృతమును వర్షించే చంద్రముఖి వజ్రవర్షము వర్షించగలదా?

ఆ అర్ధరాత్రిసమయమున నరపతిని వధించుటకు సాగిందామె ముందుకు. కటారియుక్తహస్తము "జాగ్రత! భగవంతుడున్నాడు సుమా!!" యని గగ్గోలు పెడుతూనేయున్నది. పాపినియగు నామె హస్తసంకేతమును గుర్తింపజాలకపోయింది. ఒక్కసారి హఠాత్తుగా పొడిచివేసింది లక్షపతి హృదయంలో. లక్షపతి కడపటిమాట "హా! పిశాచినీ! కపటపిశాచీ!'' అని.

రూపవతియగు రాక్షసి— సుకుమార పిశాచిని— తన విజయమునకు ప్రసన్నురాలైంది. ఇంతలో ఎవరో "వాసవదత్తా!" యని పిలచిరి. ఎవరు? ఎవరో కాదు వన శ్రమణి ఉపగుప్తుడే. కిటికీగుండా చూచింది వాసవదత్త.

"వచ్చితివా?"

"లేదు. శీఘ్రంగా పోవుచున్నాను."

"ఈకుసమయములో వచ్చుటకు కారణము."

"ఏమీలేదు విహారంకొరకు. ఇచ్చట నీ జ్ఞాపకము వచ్చినది. పోవుచున్నాను."

"ఆగు నీ ప్రతిజ్ఞ జ్ఞాపకమున్నదా?"

"అవును."

"నీ వీ సంవత్సరములోపున కలుసుకొనుటకు ప్రతిజ్ఞచేసితివి."

"ఇప్పటి కింకను అవధి ఎంత?"

"ఒకపక్షము మాత్రము."

"నేను అవధిలోపున తప్పక వచ్చెదను."

"అబద్ధమాడుచున్నావు. నన్ను మోసపుచ్చుచున్నావు."

"బౌద్ధభిక్షువు అబద్ధమాడడు. కపటమోసములు వాని ధర్మములు గావు"

* * * *

వాసవదత్త ధనముకొరకు హత్యచేసింది లక్షపతిని. రహస్యము వెల్లడైంది. న్యాయాలయములో ఉరిశిక్ష దొరకలేదు. ప్రాణశిక్ష ఆమె అశాంతజీవనమునకు శాంతినిచ్చేది. కాని అట్టిశిక్ష కేవలము ఆశీర్వచనముతో సమానము.

ఆమె రూపము విరూపము చేయబడింది. చంద్రముఖి కన్నులు పీకివేయుటకును, ముక్కు చెవులు కోసివేయుటకును, మృదుహస్తముల నరుకుటకును,

ధనసంపత్తులు లాగికొనుటకును శిక్షవేయబడింది. ఆసమయమున ఆమె కరుణాస్వనముతో "నేనొక వారము అవధి కోరుచున్నాను. నేను నాయొక ప్రేమితో కలునుకోవలెను. తరువాత ఘాతకుల హస్తములకు నా దేహమును అత్యంతప్రీతితో వప్పగించగలను" అంది; కాని ఎవరును ఆమె వినయమును వినలేదు. ఘాతకు లామెను కురూపినిగ చేసి వేసి రాజమార్గమందు వదలిరి. వీధినుండు పోవువారల కామెయొక్క పాతకకథను బిగ్గరగా చెపుతూ ఒకమనిషి ఆమెవద్దనుండెను.

నాటినుండియు సౌందర్యోపాసకులైన రసికు లామె సౌందర్యమును దూషింప నారంభించిరి కొంతిమంది అసహ్యతచే ఆమెపైన నుమియ నారంభించిరి. పథికులలోనుండు కుంటివాడై కుష్ఠురోగముచే పురుగులుపట్టిన దేహముగలవాడుగూడ అచ్చటి దృశ్యమునుండి తప్పించుకొనుటకు ప్రయాస పడుతూండెను.

ఆ సమయములో హాజరయ్యా డుపగుప్తుడు.

"ఎవరు?" అంది చకితురాలై వాసవదత్త.

"నేను."

కంఠస్వనము నానవాలుపట్టి "ఎవరు—ఉపగుప్తుడా?"

"అవును. నేను ఉపగుప్తుడనే."

"తిరిగిపొమ్ము. ఎందుకు వచ్చితివి? పరిహసించుటకా?"

"తిరిగి పొమ్మంటావా? నాప్రతిజ్ఞానుసారము."

"హా! నా దేహము వసంతసౌరభ్యముతో పరిమళించునప్పుడు నీవు రాలేదు. నా శోభాచంద్రుడు భూమిపైన అమృతచంద్రికను వర్షించునప్పుడు రాలేదు. చివరకు విరూపినిగ చేయబడకముందైనను రాలేదు. నా సౌందర్యదీప మారిపోయింది. నా శోభాసూర్యు డస్తమించాడు. ఈసమయములో నీ వెందుకొచ్చావు?"

"సోదరి! నేను ఇంద్రియసుఖములచేగాని స్వార్థముచేగాని ప్రేరితుడనై రాలేదు. శరీరసౌందర్యము వ్యర్థము. నీ ఈ శరీరమే దానికి సాక్ష్యము. ధనము నిస్సారము. నీ అతులైశ్వర్యము దీనికి జవాబిస్తోంది. నేను నీవద్దకు వచ్చాను. చెప్పవలసిన దేదో చెప్పు."

"నేనేమి చెప్పుదును? నీ యీ ప్రశ్న నా జవాబును లాగివేసింది. నేను చెప్పవలసిన దేదియు లేదు. నీ స్పర్శచే నాబాధ శాంతించగలదు. నీ వచనములచే నా సంతాపము దూరమౌతోంది."

"ఆశ ప్రపంచదుఃఖముల కాటపట్టు. నీ వీ ఆశకు దాసివైతివి. నీ వా ఆశకై నీ ధర్మమును అమ్మివేశావు. ధనాశచే లక్షపతిని హత్యచేశావు. ఈ దుఃఖసమయములో నీ ఆశ ఏ సహాయమును చేయజాలకపోయింది."

"హా! నీ వింతసమయందేవచ్చి నన్నేల రక్షించక పోతివి. వచ్చితివి. కాని ఆలస్యముగా వచ్చితివి"

ఆలస్య మేమియులేదు. ఇంకా చాలా వ్యవధి ఉంది. నీ వీ సమయములో హీనురాలవైనప్పటికినీ అంతర్నేత్రము వికసించియేయున్నది. లెమ్ము. భగవంతుని నమ్ముము వాడు నీ దుఃఖముల దూరము చేయును."

వాసవదత్త హృదయాంతరమున అమృతధార వర్షించింది. ఆమెకు ప్రపంచకపు క్షణభంగురత బోధయైనది: బోధయేకాదు అనుభవముకూడాను. భిక్షుచరణములపై వాలింది "నేను సిద్ధంగాఉన్నాను. నన్ను తీసుకొనిపొమ్ము. నా చెరగుపట్టుకొని శాంతి రాజ్యమును చేర్చుము"అంది వాసవదత్త.

భిక్షువు తన పవిత్రహస్తములతో స్పృశించాడు. ఇద్దరును సంఘమువైపు మరలిరి. పాపతాపములో మండిపోతూన్న వాసవదత్త ప్రాయశ్చిత్తమనే దేవతాసాగరమున స్నానముచేసింది. సన్యాసినియై తన జీవితశేషమును గడిపింది.

—హిందీనుండి అనువాదము.